క్లుప్తంగా

పట్టణంలో రేపటి నుంచి ఆధార్ నవీకరణ శిబిరాలు

కపిలేశ్వరపురం (మండపేట): 5 నుంచి 8 వరకూ మొదటి విడతగానూ, 12 నుంచి 15 వరకూ రెండో విడతగానూ రెండు విడతలుగా మండపేట పట్టణంలో ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలను నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు బాలఆధార్ నమోదు, 5 –15 వయస్సు గల బాలబాలికలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియను శిబిరాల్లో ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకూ నవీకరణ చేస్తారన్నారు. 5 నుంచి 8 వరకూ తరవాణీపేటలోని శ్రీరామ హిందూ మున్సిపల్ పాఠశాల వెనుక గల మూడో సచివాలయంలోనూ, సత్యశ్రీ రోడ్డులోని ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోనూ నవీకరణ సేవలందిస్తారన్నారు. 12 నుంచి 15 వరకూ తరవాణీపేటలోని శ్రీరామ హిందూ మున్సిపల్ పాఠశాల వెనుక గల రెండో సచివాలయంలోనూ, గొల్లలగుంటలోని ఒకటో సచివాలయంలోనూ నవీకరణ సేవలందిస్తారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

కిశోరి వికాసం శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



మాచవరంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సీతామహాలక్ష్మి

రాయవరం: కిశోరి వికాసం పేరుతో బాలికలకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వి.విష్ణుకుమారి పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ రాయవరం ప్రాజెక్టు పరిధిలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మండలంలోని సోమేశ్వరం, మాచవరం గ్రామాల్లో శనివారం ప్రారంభించారు. విష్ణుకుమారి మాట్లాడుతూ విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత వంటి 12 అంశాలపై జూన్ 10వ తేదీ వరకు అవగాహన కల్పిస్తామన్నారు. మాచవరంలో సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ బాలికలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తీపర్తి శ్రీరమేష్, మేడపాటి అశోక్‌రెడ్డి, గుణ్ణం భాస్కరరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెమ్మ ఆలయ దశమ వార్షికోత్సవం



సత్తెమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: రాయవరంలో మల్లేశ్వరపు వంశీకుల సత్తెమ్మతల్లి ఆలయ దశమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఘనంగా అన్న సమారాధన చేపట్టారు. రాయవరం, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ భవనంలోకి పీహెచ్‌సీ తరలింపు

రాయవరం: రాయవరం పీహెచ్‌సీని బీసీ హాస్టల్ భవనంలోకి శనివారం తరలించారు. బీసీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. శిథిలస్థితిలో ఉన్న పీహెచ్‌సీని సురక్షిత ప్రదేశానికి తరలించాలన్న డిమాండ్ నేపథ్యంలో బీసీ హాస్టల్ భవనంలోకి మార్చారు. సురక్షిత ప్రదేశంలోకి మార్చిన పీహెచ్‌సీలో ప్రజలు వైద్య సేవలు పొందాలని ఎమ్మెల్యే జోగేశ్వరరావు సూచించారు. అలాగే 129 మహిళలకు స్వయం ఉపాధి పథకంలో భాగంగా కుట్టు మెషీన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే జోగేశ్వరరావు ప్రారంభించారు. అలాగే రాయవరంలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు.

విలేకరులకు సత్కారం

కపిలేశ్వరపురం (మండపేట): పాత్రికేయ వృత్తి సామాజిక బాధ్యతను తెలుపుతుందని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అన్నారు. మండపేట టౌన్ హాల్‌లో శనివారం ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల రిపోర్టర్లను సత్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛను హరించివేస్తున్న సంఘటనలు బాధ కలిగిస్తున్నాయన్నారు. అయినప్పటికీ సామాజిక ప్రగతే ధ్యేయంగా పాత్రికేయులు, పత్రికా యాజమాన్యాలు ప్రజాస్వామిక విలువల పరిరక్షణకు కృషి చేస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బళ్ల శ్రీనివాసరావు, ఎస్.భద్రరావు పాల్గొన్నారు.

వాతావరణం అనుకూలం.. ప్రభుత్వం ప్రతికూలం

- ధాన్యం కొనే దారిలేక రైతు సతమతం
- లక్ష్యం పూర్తయిందన్న సాకుతో తిరస్కరిస్తున్న కేంద్రాలు
- దాచుకొనే మార్గంలేక దళారుల పాలు
- చేతులెత్తేసిన కూటమి సర్కార్
- లబోదిబోమంటున్న రైతులు



వరి పంటను కోస్తున్న యంత్రం

కపిలేశ్వరపురం: సుమారు మూడు నెలల కష్టం. ఎండావానలకు వెరవక, ప్రభుత్వం నుంచి కనీసం రూపాయి సాయం లేకపోయినా మనో నిబ్బరంతో రబీ సాగు చేశాడు సామాన్య రైతు. ఒడుదొడుకులను అధిగమించి, వాతావరణ అనుకూలతతో చివరికి వరి చేతికందింది. దిగుబడి అనుకూలంగా వచ్చిందన్న ఆనందంతో రొమ్ము విరిచి ధాన్యం అమ్మేందుకు అడుగువేయగా సర్కార్ కొట్టిన దెబ్బతో కుదేలయ్యాడు. స్వయంగా సర్కారే ప్రారంభించిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనేది లేదని.. లక్ష్యం పూర్తయిందంటూ చావు కబురు చల్లగా చెబుతున్నారు. ధాన్యం కొనే కేంద్రానికి లక్ష్యం ఏంటి? ప్రతి గింజనూ కొనడమే లక్ష్యం కదా? అంటూ అమాయక ప్రశ్నతో దిక్కుతోచని స్థితిలో రైతు సతమతమవుతున్నాడు. ప్రతి గింజను సర్కార్ కొనకపోవడం వెనక రహస్యం రైతు కష్టం దళారుల పాలవ్వడమేనంటూ అభ్యుదయకాముకులు విశ్లేషిస్తున్నారు.

మండపేట నియోజకవర్గంలో రబీ సాగు ఇలా...

కపిలేశ్వరపురం మండలంలో 15,760 ఎకరాల్లో వరిని సాగు చేయగా 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మండపేట మండలంలో 16,300 ఎకరాలు సాగుకు గాను 4 వేల మెట్రిక్ టన్నులు, రాయవరం మండలంలో 14,580 ఎకరాలు సాగుకు గాను 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మండపేట మండలంలో 11, కపిలేశ్వరపురం 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వాతావరణ భయాలతో సతమతం

ఏప్రిల్ మూడో వారంలో వాతావరణం ప్రతికూలంగా మారి రైతును తీవ్రమైన ఆందోళనలోకి నెట్టింది. అప్పటికి మరో 10 నుంచి 20 రోజుల్లో పంట చేతికొస్తుందనగా వర్షం కురిసి కాస్త నష్టం కలిగించింది. ఎట్టకేలకు వాతావరణం అనుకూలంగా మారడంతో రైతు ఊపిరి పీల్చుకొన్నాడు. వాతావరణ పరిస్థితులు, కూలీల లభ్యత, ఖర్చుల భారం నేపథ్యంలో వరికోతలకు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. కోతలు, కట్టేతలు, కుప్ప నూర్పిళ్ల, ధాన్యం ఎగరబోతలు, ధాన్యం తరలింపు తదితర యాతన యంత్రాలతో తప్పుతోంది. సీజన్ ప్రారంభం కాబోతోందనగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి వరికోత యంత్రాలు ఏప్రిల్ రెండో వారంలో నియోజకవర్గంలోకి వచ్చాయి. కూలీలతో కోతలకు ఎకరాకు రూ.10 నుంచి రూ.15 వేలు అవుతుండగా యంత్రాలతో రూ.8 వేలకు తగ్గుతోంది.

చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

ధాన్యం కొనుగోలులో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని, తమ కేంద్రానికి నిర్దేశించిన లక్ష్యం పూర్తయిందంటూ తమను వెనక్కి పంపేస్తున్నారంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రైతు పక్షాన నిలిచి జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి పలుమార్లు కృషి చేశారు.

ఆందోళన బాటలో రైతులు

మండపేట మండలం కేశవరంలోని రైతు సేవా కేంద్రంలో జిల్లాలోనే తొలి ధాన్యం సేకరణ కేంద్రంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. హంగు అర్భాటాలతో ప్రారంభ కార్యక్రమం బాగానే జరిగినా నిర్వహణలో ప్రతికూలత ఏర్పడింది. తమ కేంద్రంలో లక్ష్యం పూర్తయిందన్న పేరుతో కొనుగోలు నిలిపివేశారు. దీంతో ఏప్రిల్ 20న రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు.

పూర్తి స్థాయిలో కొనే బాధ్యత ప్రభుత్వానిదే



జిల్లాలో ఆరు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా తొలుత 80 వేల మెట్రిక్ టన్నులు, మలి విడతలో లక్షా 40 వేల మెట్రిక్ టన్నులను మాత్రమే కొనుగోలు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. రైతు ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గింజను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొన్న అనుభవం ఉంది. గిట్టుబాటు ధర రూ.1730 కాగా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులకు రూ.1500కు అమ్ముకొంటున్నారు. దళారుల ప్రభావంతో బస్తాకు రూ.300 చొప్పున ఎకరా దిగుబడికి రూ.15 వేలు రైతు కుటుంబం నష్టపోతోంది. రైతుకు మిగిలేదంతా దళారుల పాలవుతోంది.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ, మండపేట

పుష్కరాలను ఘనంగా నిర్వహించుకుందాం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల

రామచంద్రపురం: 2027లో రానున్న గోదావరి పుష్కరాలను ఘనంగా క్షేమంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు, అధికారులను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో శనివారం 2027లో గోదావరి పుష్కరాలకు సంబంధించి రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఉన్న పుష్కర ఘాట్లలో మరమ్మతులు, వసతుల కల్పనపై ఆర్డీవో అఖిల అధ్యక్షతన అధికారులతో సమీక్షించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ రానున్న గోదావరి పుష్కరాలను ఘనంగా, క్షేమంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పుష్కర ఘాట్లలో ఏర్పాటు చేయాలన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో పుష్కర ఘాట్లను పరిశీలించి తమ శాఖల పరిధిలో కల్పించాల్సిన వసతులపై ఓ అంచనాకు రావాలన్నారు. త్వరలో మరో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షిస్తామన్నారు. ఆర్డీవో అఖిల మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలో కె.గంగవరం మండలంలో 14, కపిలేశ్వరపురం మండలంలో 8 పుష్కర ఘాట్లు ఉన్నాయన్నారు. రెండు నియోజకవర్గాల్లోనూ ప్రజలు పుష్కర పుణ్యస్నానాల కోసం ఇతర జిల్లాలకు వెళ్లకుండా ఇక్కడే అవసరమైన వసతులు కల్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులందరూ వారి పరిధిలోని పుష్కర ఘాట్లకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కల్పించాల్సిన వసతులు, ఏర్పాట్లపై అంచనాలు తయారు చేయాలన్నారు. అంచనాలు త్వరగా తయారు చేసి ఆర్డీవో కార్యాలయానికి సమర్పిస్తే వాటిని క్రోడీకరించి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. త్వరితగతిన అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తే నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులందరూ ప్రజా ప్రతినిధులతో చర్చించి అంచనాలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత వాసంశెట్టి సత్యం, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల ఎంపీడీవోలు చిన్నారావు, శ్రీనివాస్, రెవెన్యూ ఇరిగేషన్, ఆర్అండ్‌బీ పంచాయతీరాజ్, మత్స్యశాఖ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోంది

- ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా మాలల ఐక్య పోరాటం
- ఈ నెల 12న కాకినాడలో మహారణభేరి



మాలల మహారణభేరి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ విమర్శించారు. రాయవరం దళితపేటలో అశోక్‌కుమార్ శనివారం స్థానిక దళిత నేతలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా మాలలంతా ఐకమత్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 12న కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు మాలల మహారణభేరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు జయంతిని పురస్కరించుకుని మాలల మహారణభేరిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. టీడీపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు ఎస్సీలను బలి చేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలనే పార్టీల ఉద్దేశాన్ని ముందుగానే గ్రహించిన పీవీ రావు మాల మహానాడును స్థాపించి వర్గీకరణపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. 2004లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వర్గీకరణ చేసే హక్కు రాష్ట్రాలకు లేదన్నారు. 341 ఆర్టికల్ ప్రకారం వర్గీకరణ చేసే హక్కు రాష్ట్రాలకు లేదని సుప్రీంకోర్టు ఐదుగురు బెంచి ధర్మాసనం తీర్పునిచ్చిందన్నారు. అయినప్పటికీ మాలలను అణగదొక్కాలనే ఉద్దేశంతో తప్పుడు లెక్కలతో మరోసారి వర్గీకరణ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెరపైకి తెచ్చాయన్నారు. ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా మాలలంతా వేలాదిగా తరలివచ్చి 'మాలజాతి' ఉనికిని సమాజానికి చాటి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

వర్గీకరణ వలన ఏ ఒక్కరికీ ప్రయోజనం చేకూరదన్నారు. టీడీపీ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా వర్గీకరణ ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చిందని మొదటి నుంచి చెబుతున్నామన్నారు. ఈ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను న్యాయస్థానంలో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిరసన తెలియజేసేందుకు మాలలంతా కాకినాడకు వేలదిగా తరలి వచ్చి మాలల ఆత్మగౌరవం కాపాడేందుకు ఈ మహా రణభేరిని విజయవంతం చేయాలని కోరారు. వర్గీకరణ అమలైతే మాలలు అన్ని విధాలుగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. గురుకుల పాఠశాలల్లో కూడా సీట్లు దొరకని పరిస్థితి ఉంటుందని, డీఎస్సీలో మాల నిరుద్యోగులు నష్టపోయే పరిస్థితి నెలకొంటుందన్నారు. ఉద్యోగులు కూడా పదోన్నతుల విషయంలో వారి హక్కులను కోల్పోతారన్నారు. వర్గీకరణ విషయంలో మాలలు మెళకువగా ఉండి, సంఘటితంగా పోరాటం చేసే విషయంలో రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి సహకరించాలన్నారు. మాలల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. మాలల మహారణభేరి కరపత్రికలను పండు అశోక్ కుమార్ ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాకర రాము, మాల జేఏసీ జిల్లా చైర్మన్ బుంగ సతీష్‌కుమార్, మాల మహానాడు నేతలు నేతల రాజు, నేతల చినబాబు, నేతల జాన్, వార సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం



కపిలేశ్వరపురంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్



అర్తమూరులో మాట్లాడుతున్న సీడీపీఓ గజలక్ష్మి

కపిలేశ్వరపురం (మండపేట): కౌమార దశలో సామాజిక, ఆరోగ్య అంశాలపై కిశోర బాలికలకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. ప్రాజెక్టు పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం కిశోరి వికాసం-2 కార్యక్రమంలో భాగంగా వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. సీడీపీఓ అధికారి గజలక్ష్మి ఆధ్వర్యంలో ఆయా మండలాల సూపర్వైజర్లు పర్యవేక్షణలోని అంగన్వాడీలు క్షేత్రస్థాయిలో కార్యక్రమం లక్ష్యాన్ని వివరించారు. కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లో సూపర్వైజర్లు ఐ.మాణిక్యం, పి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశ, వైద్య,ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపేటలో...

మండపేట పట్టణంలోని 332, 321, 320, 329, 330 కేంద్రాల్లోనూ, రూరల్ మండలంలోని 12 గ్రామాల్లోనూ నిర్వహించిన కార్యక్రమాల్లో కిశోరి బాలికలకు వైద్య కార్యకర్తలు, అంగన్‌వాడీలు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనపర్తిలో సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నల్లమిల్లి వీర్రెడ్డి, పడాల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బాలికల ఆరోగ్యంపైనే భావి భారతం ప్రగతి ఆధారపడుతుందన్నారు. సూపర్వైజర్లు సీహెచ్ శ్రీదేవి, పి.సునీత, సింహాచలం కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో గజలక్ష్మి మాట్లాడుతూ జూన్ 10 వరకూ కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. 11–18 సంవత్సరాల కిశోర బాలికలను 20 మందితో ఒక సమూహంగా ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామన్నారు. రుతుక్రమంలోని శాస్త్రీయ అంశాలు, కౌమార దశలో రక్తహీనత, ఇతర ఆరోగ్య అంశాలు, బాల్య వివాహాలు, లింగ వివక్ష, ఉన్నత విద్య ప్రాధాన్యం తదితర అంశాలపై కిశోర బాలికలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జీఎంఎస్‌కేలు, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ఒంటితాడిలో ధాన్యం రాశులపై నిలబడి నిరసన తెలియజేస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

కాజులూరు: రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును ప్రభుత్వం వేగవంతం చేయాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. శనివారం మండలంలోని కాజులూరు, చేదువాడ, ఒంటితాడి, శీల తదితర గ్రామాల్లో రాజబాబు తదితర రైతు సంఘాల నాయకులు పర్యటించి రైతులను కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కనీస మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ.1725 ప్రకటించినప్పటికీ రైతు సేవాకేంద్రాల ద్వారా కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో మిల్లర్లు దళారుల ద్వారా రూ.1550కే కొనుగోలు చేస్తున్నారన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సరిపోక రైతులు ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతుంటే కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరగక తక్కువ ధరకు అమ్ముకోవలసి వస్తుందన్నారు. దీంతో నికర ఆదాయం తగ్గి అప్పులపాలవుతున్నారన్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలలో కాటా, జట్టును ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు ప్రోత్సహించి రైతులు కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల కౌలు రైతు సంఘం నాయకులు దండంగి సమర్పణరావు, బిల్లా సూరిబాబు, అంగడి ఈశ్వర్రావు, దండంగి సత్యనారాయణ, దంగేటి అప్పారావు, ఎస్ ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వైద్య పద్ధతులపై అవగాహన



మండపేటలో పీఎంపీలతో మాట్లాడుతున్న వైద్యుడు

కపిలేశ్వరపురం (మండపేట): ఆధునికంగా ఉనికిలోకి వస్తున్న వైద్య పద్ధతులపై ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్‌కు అవగాహన అవసరమని పలువురు వైద్యులన్నారు. మండపేట టౌన్ హాల్‌లో శనివారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన తరగతిని నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని జీఎస్ఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రామ్ గోపాల్ తేజ, న్యూరోసర్జన్ డాక్టర్ అద్దేపల్లి శ్యామ్‌సుందర్, గైనకాలజిస్ట్ డాక్టర్ మాణిక్యాంబలు వారి వారి వైద్య విభాగాలపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ నాయకులు మట్టా వీరబాబు, బీవీ రమణ, ఇరవాడ రవికుమార్, వీకే రాజు, బళ్ళా శ్రీనివాస్, కోన సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలోని 53 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు. ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.30,09,790 విలువైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

రామచంద్రపురం: రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు తడిసిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జిల్లాలో దళారీ వ్యవస్థను పూర్తి స్థాయిలో అరికట్టాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలకు కళ్లాల్లో నిలువ ఉన్న ధాన్యం, ఇంకా కోత కోయవలసిన పంట తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో మబ్బులు, ఉరుములు, చినుకుల వల్ల రైతు గుండెల్లో గుబులు పుట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేయడం వల్ల తడిసిపోయిందని తెలిపారు. దళారీలు ధాన్యంలో తేమశాతం ఉందని, తాలు ఉందని కుంటి సాకులతో 75 కిలోల బస్తాను రూ.1550 రూపాయలకు ధాన్యం కొనుగోలుదారులు, సిబ్బంది దోచుకోవడానికి సిద్ధమయ్యారన్నారు. రైస్ మిల్లర్స్ సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారని అన్నారు. రైతు రాజ్యమే తమ లక్ష్యమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఉమ్మడి కూటమి ప్రభుత్వం నేడు రైతులను పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సివిల్ సప్లై అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని అన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, రేయింబవళ్లు పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం, రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని, వారికి ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) కోనసీమ జిల్లా మహాసభ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షుడు కె.స్వాతి ప్రసాద్ అధ్యక్షతన శనివారం రామచంద్రపురంలో జరిగింది. ఈ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మంత్రి సుభాష్ మాట్లాడారు. తొలుత పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల రక్షణ కోసం జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో హై పవర్ కమిటీ ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తామన్నారు. హెల్త్ కార్డులు పునరుద్ధరించడంతో పాటు, అర్హులైన వారికి అక్రిడిటేషన్లు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అందేలా కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయం ముఖ్యమంత్రి పరిశీలనలో ఉందని, త్వరలోనే ఇళ్ల స్థలాలు అందజేస్తామన్నారు. జర్నలిస్టులు వాస్తవాలు రాయడంలో ముందుండాలని, కల్పితాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జర్నలిస్టుల ఆరోగ్య రక్షణ కోసం రామచంద్రపురంలో త్వరలోనే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐజేయు జాతీయ కార్యదర్శి డి.సోమ సుందర్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు వేతన చట్టం అమలు చేయాలని, దాడులు జరగకుండా పటిష్ట రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడుల విషయమై ప్రపంచంలోని 180 దేశాల్లో పోలిస్తే మన దేశం 151వ స్థానంలో ఉండడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల వేతన చట్టం 1955లో తీసుకొచ్చినప్పటికీ నేటికీ అమలు కాలేదన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణ కోసం పాలక పక్షాలు కృషి చేసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర తరహా చట్టాలు తీసుకురావాలన్నారు. జర్నలిస్టులకు వృత్తి భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మండెల శ్రీరామమూర్తి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఎంపీపీ అంబటి భవాని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా ఆసుపత్రి సిబ్బంది ప్రవర్తన



మండపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద క్షతగాత్రుడు

కపిలేశ్వరపురం (మండపేట): రోడ్డు ప్రమాద క్షతగాత్రులపై మండపేట పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మాదిగ దండోరా రాష్ట్ర నాయకులు ధూళి జయరాజు ఆరోపించారు. పట్టణంలో శనివారం పెద్ద కాలువ వంతెన సమీపంలో జరిగిన ప్రమాదంలో గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లగా సిబ్బంది నిర్లక్ష్య వైఖరిని వ్యక్తం చేశారన్నారు. పట్టణానికి చెందిన కాంక్రీట్ పని చేసే భవన నిర్మాణ కార్మికులు కుందేటి సత్తిబాబు, ఖండవల్లి ఆనంద్ అనపర్తిలో పనిచేసేందుకు టూ వీలర్ వాహనంపై వెళ్తున్నారు. పెద్ద కాలువ వంతెన వద్ద వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని కాకినాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టిందన్నారు. గాయాలపాలైన ఇద్దరినీ 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. క్షతగాత్రులకు వైద్యమందించే విషయంలో వైద్యులు సకాలంలో స్పందించకుండా ఏఎన్ఎం మేల్‌తో కుట్లు వేయించారని, శాస్త్రీయ పద్ధతిలో గాయాలను శుభ్రం చేయకుండా కుట్లు వేస్తే సెప్టిక్ అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన సేవలందించే దిశగా ఆసుపత్రిని నిర్వహించాలని జయరాజు కోరారు.